ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 17 ఏప్రిల్ 2024

సీతారాముల కల్యాణం చూతము రారండి



నేడే శ్రీరామ నవమి

- ఊరూరా, వాడవాడల ఉత్సవాలకు ఏర్పాట్లు
- కల్యాణానికి ముస్తాబైన ఆలయాలు
- పలుచోట్ల సీతారాముల విగ్రహాల అమ్మకాలు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 16: అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే శ్రీరామ నవమి వేడుకలకు జిల్లా ముస్తాబైంది. బుధవారం వేడుకల్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించేందుకు ఆలయాలను ముస్తాబుచేశారు. అలాగే ప్రధాన కూడళ్లలో కూడా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు. చైత్ర శుద్ధ నవమి బుధవారం అభిజిత్ లగ్న సుముహూర్తాన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు..

శ్రీరామ నవమి వచ్చిందంటే కల్యాణోత్సవం నిర్వహణ సందడి కొనసాగుతుంది. ప్రతీ ఏటా జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో, డివిజన్ కేంద్రాల్లోని ప్రధాన ఆలయాల్లో కల్యాణోత్సవాలు జరుగుతాయి. వరంగల్‌లోని ఎల్లంబజార్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం, గీతాభవన్, ఆకారపు వారి గుడి, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో, శ్రీసాయిబాబా దేవాలయంలో, శ్రీభద్రకాళి దేవాలయంలో, దత్త క్షేత్రంలో, కాశిబుగ్గ ఓసిటీ ఆలయంలో, గోవిందరాజుల గుట్టపైన, రంగనాయక స్వామి దేవాలయంలో, గురుధామం, శ్రీసీతారామ కల్యాణ ఉత్సవ సమితుల ఆధ్వర్యంలో వాడవాడల కల్యాణోత్సవాలను నిర్వహించడానికి వేదికలు ఏర్పాటు చేసి సిద్ధం చేస్తున్నారు. రామనామ స్మరణతో వాడవాడల కల్యాణోత్సవాలను నిర్వహించే క్రమంలో భక్తుల సందడి పెరిగింది. అయోధ్యలో శ్రీరామమందిరం ప్రారంభోత్సవం దరృనార్థం రాముని పండుగను ఘనంగా నిర్వహించాలని ఇంటింటికి ప్రచారాలు నిర్వహిస్తూ భక్తుల సందడి నెలకొంది.

విగ్రహాలు, పూజా సామగ్రి విక్రయాలు..

శ్రీరామ నవమిని పురస్కరించుకొని వరంగల్ ఎంజీఎం సెంటర్, భద్రకాళి ఆలయం ఆర్చి, సెంట్రల్ జైలు రహదారిపై శ్రీసీతారాముల లక్ష్మణ ఆంజనేయుల విగ్రహాలు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, వేడుకల పూజా సామగ్రి అమ్మకాలతో నగరంలో సందడి నెలకొంది. పూజా సామానులు, పూలు, పండ్లు, మామిడాకు, తమలపాకులు ఇతర పూజా సామాగ్రి అమ్మకాలు వరంగల్ చౌరస్తా, పోస్టాఫీస్ సెంటర్, చమన్, కాశిబుగ్గ, అండర్‌బ్రిడ్జి ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.



ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో దేవతామూర్తులు

మహా అన్నదానాలకు ఏర్పాట్లు...

శ్రీరామ నవమి సందర్భంగా ఆలయాలు, ప్రత్యేక మండపాల వద్ద మహాఅన్నదాన కార్యక్రమాలకు సర్వం సిద్ధం చేశారు. ఆలయాలు, కూడళ్లలో చలవ పందిళ్లు వేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, మజ్జిగను అందుబాటులో ఉంచారు.

రూరల్‌లో సందడే సందడి..

వేడుకలు రూరల్ ప్రాంతాలు ముస్తాబయ్యాయి. నర్సంపేటలోని వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, వర్ధన్నపేటలోని ఆంజనేయస్వామి శ్రీరామ నవమి వేడుకలు సిద్ధమయ్యాయి. అలాగే చెన్నారావుపేట, ఖానాపూర్, నెక్కొండ, నల్లబెల్లి, దుగ్గొండి, సంగెం, గీసుగొండ, రాయపర్తి, పర్వతగిరి మండల కేంద్రాల్లో, గ్రామాల్లో కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. రాయపర్తి మండల కేంద్రంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, నన్నూర్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయం, గీసుగొండలోని పంచముఖ స్వామి ఆలయం, కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, దుగ్గొండిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.



శ్రీభద్రకాళి దేవాలయంలో కల్యాణోత్సవానికి చలువ పందిళ్ల ఏర్పాటు



ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో దేవతామూర్తులు

రూ.5.37 లక్షల స్వాధీనం



వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద తనిఖీలో నగదును పట్టుకున్న పోలీసులు

మట్టెవాడ/ వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈమేరకు రూ.5లక్షల37వేల 200 నగదును స్వాధీన పరుచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తున్న శివనగర్ ప్రాంతానికి చెందిన ప్రతిపాక రమేశ్ వద్ద నుంచి రూ.2.50 లక్షలు, వరంగల్ పెరుకవాడకు చెందిన పాశికంటి శంకర్ నుంచి రూ.లక్ష77వేల 200, ఖిలావరంగల్ ప్రాంతానికి తోట జగన్ నుంచి రూ.1.10 లక్షలు నగదును స్వాధీన పరుచుకున్నామని వెల్లడించారు. ఈ వాహన తనిఖీల్లో సీఐలు టి.గోపీ, పి.మల్లయ్య, ఎం.శివకుమార్, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్, మిల్స్ కాలనీ పోలీసులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు

- 18నుంచి 25వ తేదీ వరకు స్వీకరణ
- వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈనెల 18వతేదీ నుంచి 25వరకు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్న నేపథ్యంలో మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వందమీటర్ల దూరం వరకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఇతరులెవరూ ప్రవేశించకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన నిర్వహించి ఆ సమాచారాన్ని అభ్యర్థులకు తెలియజేసేలా అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ మధ్య చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల మేర ఇరువైపులా బారికేడ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులు 30నిమిషాల ముందుగానే కేంద్రానికి చేరుకొని నామినేషన్ సమర్పించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ అబ్దుల్ బారీ, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగరాలే, డీఆర్‌ఓ శ్రీనివాస్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, డీపీఆర్‌ఓ అయూబ్ అలీ, పర్యవేక్షకులు విశ్వనారాయణ, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి..

నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నామినేషన్ల ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అంశాలపై వివరించారు. 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. నామినేషన్‌కు ముందే అభ్యర్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో నూతన ఖాతా తెరవాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎస్సీలకు కేటాయించినందున ఎస్సీ అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల ఖరారు తర్వాత ఎన్నికల ఖర్చు, నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పాటించాల్సిన నిబంధనలపై వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజ్ కుమార్ ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, కాంగ్రెస్ పార్టీ నుంచి ఇవి.శ్రీనివాస్, నిహాల్, బీజేపీ అమరేందర్, బి.హరిశంకర్, నిశాంత్, టీడీపీ నాగరాజు, బీఎస్పీ నుంచి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



మెరుగు కౌశిక్ (ర్యాంకు 82)
జయసింహారెడ్డి (ర్యాంకు 103)
ప్రణయ్ కుమార్ (ర్యాంకు 554)
సైంపు కిరణ్‌కుమార్ (ర్యాంకు 568)
కోటే అనిల్‌కుమార్ (ర్యాంకు 743)

మనోళ్లు మెరిశారు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురికి సివిల్స్‌లో ర్యాంకులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రత్నాలు మెరిశారు. ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తాచాటారు. జనగామ పట్టణానికి చెందిన మెరుగు కౌశిక్ 82, హనుమకొండలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103వ ర్యాంకు సాధించగా, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ 554వ ర్యాంకు, వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568, వరంగల్ నగరంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 743వ ర్యాంకు సాధించి సత్తాచాటారు.

7

- వరంగల్ ఎడ్యుకేషన్/గీసుగొండ/ జనగామ కల్చరల్/రఘునాథపల్లి

భద్రకాళికి లక్ష చామంతులతో అర్చన

- ఎనిమిదో రోజుకు చేరిన వసంత నవరాత్రోత్సవాలు



లక్ష చామంతి పూల అర్చనలో భద్రకాళి అమ్మవారు

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 16: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారి దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నారు. మంగళవారానికి వేడుకలు 8వ రోజుకు చేరాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, విశేష పూజారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి లక్ష చామంతి పూలతో లక్ష పుష్పార్చన చేశారు. అనంతరం వివిధ భోగములతో నివేదన చేసి నీరాజనం, మంత్ర పుష్పాలు గావించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మంగళవారం అష్టమి తిథికి ఆదిదేవత శంకరుడు కావడంతో యోగంలో అమ్మవారికి జరుపబడే పూజకు విశేష ప్రాధాన్యముంటుందని, మంగళవారం భక్తులు అధికంగా కొలుస్తారని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. కాగా, అమ్మవారిని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీ పాపారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శేష భారతి, ప్రధానార్చకులు శేషు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు.

అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

- బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకూ సమన్యాయం
- వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- భూపాలపల్లిలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 16: బీజేపీ అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలని కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన భూపాలపల్లి పట్టణ పరిధి కందూరుపల్లిలోని ఏఎస్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగింది. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు అనుమాండ్ల యశస్విని, కె.నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ పేదలకు అండగానే ఉండే పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. దేశంలో కులమతాల మధ్య కలహాలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటున్న బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. దేశ ప్రజల మధ్య ఐక్యత కోసం రాహుల్ గాంధీ విశేష కృషి చేస్తున్నారని అన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర చేపడుతూ ప్రజలకు భరోసా ఇచ్చారని తెలిపారు. అన్ని వర్గాలకూ న్యాయం

మిగతా 8వ పేజీలో


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ ● ములుగులో నేర పరిశీలన సమీక్ష

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించాలని మల్టీజోన్-1 ఐజీ ఏవీ.రంగనాథ్ అన్నారు. ములుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ శబరీశ్ అధ్యక్షతన నేర పరిశీలన సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై పోలీస్‌స్టేషన్ల వారీగా ఐజీ సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ 2022 కన్నా ముందు పెండింగ్‌లో ఉన్న కేసులను నెల రోజుల్లో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ములుగు జిల్లాలో మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న దృష్ట్యా రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఛత్తీస్‌గఢ్, ములుగు సరిహద్దు ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ బలగాల ద్వారా ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఎన్నికల ప్రక్రియ పట్ల నమ్మకం కలిగేలా గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని, నగదు, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చెక్‌పోస్టుల వద్ద నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి రవాణా ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో జిల్లా రహదారులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రధాన, ఇతర కూడళ్ల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, డీఎస్పీలు రవీందర్, రాములు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ములుగు, పస్రా, ఏటూరునాగారం, వెంకటాపురం సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, రాజు, బండారి కుమార్, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన చల్లగరిగ

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో సిరిపెల్లి సుధాకర్ మృతి

చిట్యాల, ఏప్రిల్ 16: భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామానికిచెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉద్యమ ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్, బస్తర్ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సుధాకర్ మృతిచెందినట్లు తెలియడంతో చల్లగరిగ గ్రామం ఉలిక్కిపడింది. సిరిపెల్లి ఓదెలు - రాజపోచమ్మ దంపతులకు ఓ కుమారుడు, ఓకుమార్తె కాగా, సుధాకర్ స్థానికంగా 9వ తరగతి చదువుతున్న క్రమంలో పీపుల్స్‌వార్ పార్టీలో సానుభూతి పరుడిగాపనిచేసి 2000లో పూర్తిస్థాయిలో అజ్ఞాతంలోకి వెళ్లాడు. తన చిన్నమ్మ కుమారుడు కలికోట శంకర్ అప్పటికే పీపుల్స్‌వార్‌లో ఉండంతో సుధాకర్ పార్టీకి దగ్గరయ్యాడు. సుధాకర్ తండ్రి ఓదెలు 15 యేళ్ల కిందట మృతి చెందాడు. ఇక సోదరి స్వరూప, ఆమె భర్త మృతిచెందడంతో వారి కుమార్తె, కుమారుడిని సుధాకర్ తల్లి రాజపోషమ్మ పోషిస్తోంది. మనవరాలికి వివాహం కాగా, మనువడు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రాజపోషమ్మ చల్లగరిగలోని ఇంటివద్దే ఉంటూ వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. సుధాకర్ మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడన్న వార్త తెలవడంతో రాజపోషమ్మ, కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు.

స్నేహంతో ముడిపడిన నేపథ్యం

చల్లగరిగ గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్, రౌతు విజేందర్ స్నేహితులు, సుధాకర్ అన్న కలికోట శంకర్ పీపుల్స్‌వార్‌లో పనిచేస్తుండడంతో వీరు కూడా అటు నడిచి.. 1996-98ల్లో వరంగల్ సెంట్రల్ జైలు జీవితం గడిపారు. 2000లో సుధాకర్, విజేందర్ పూర్తి స్థాయిలో దళ సభ్యులుగా ఉద్యమ జీవితాన్ని ప్రారంభించగా విజేందర్ అలియాస్ శ్రీను ఐదేళ్ల కిందట ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. సుధాకర్ నిజామాబాద్ జిల్లా ఏరియా జిల్లా కమిటీ సభ్యుడిగా, అనంతరం శంకర్ పేరుతో ఛత్తీస్‌గఢ్ ఏరియాలో జిల్లా కార్యదర్శిగా పని చేసినట్లు సమాచారం.

అడవిలో ముగిసిన చల్లగరిగ ప్రస్థానం

చల్లగరిగ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మావోయిస్టు ఉద్యమాల్లో చురుకైన పాత్రను పోషించారు. కలికోట శంకర్ 1996లో భూపాలపల్లి ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో, రౌతు విజేందర్ ఐదేళ్ల కిందట, తాజాగా సిరిపెల్లి సుదాకర్ మృతితో ఉద్యమ నేపథ్యం ముగిసింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను

పకడ్బందీగా నిర్వహించాలి..

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన

నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 16: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు కృషిచేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన కోరారు. ఈ మేరకు నల్గొండ కలెక్టరేట్ కార్యాల యం నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గపరిధిలోని వివిధ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది, శిక్షణ కేంద్రాల గుర్తింపు, డీఆర్సీ, స్ట్రాంగ్ రూమ్స్, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ బృందాల ఏర్పాటు, మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారుల నియామకం, జోనల్ ఆఫీసర్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పోలింగ్‌కు అవసరమైన వాహనాలు తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారి హరిచందన వివిధ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, ఎన్.వెంకటేష్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మనోళ్లు మెరిశారు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురికి సివిల్స్ ర్యాంకులు


కుటుంబ సభ్యులతో 568వ ర్యాంకు సాధించిన సైంపు కిరణ్‌కుమార్


కుటుంబ సభ్యులతో కౌశిక్


తల్లిదండ్రులతో 554వ ర్యాంకు సాధించిన ప్రణయ్ కుమార్

వరంగల్ ఎడ్యుకేషన్/ గీసుకొండ, ఏప్రిల్ 16: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా యువకులు మెరిశారు. మొత్తం ఐదుగురు ఉత్తమ ర్యాంకులు సాధించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ నగర్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 103 ర్యాంకు, వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సైంపు కిరణ్‌కుమార్ 568, వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన కోటే అనిల్‌కుమార్ 743, జనగామ పట్టణానికి చెందినమెరుగు కౌశిక్ 82, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ 554వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. వీరిలో హనుమకొండ విద్యుత్‌నగర్‌కు చెందిన జయసింహారెడ్డి గతేడాది సివిల్స్‌లో 217వ ర్యాంకు సాధించి ఐపీఎస్ శిక్షణలో ఉన్నారు. కానీ ఐఏఎస్ లక్ష్యంతో తాను సివిల్స్ రాశానని, ఇప్పుడు వచ్చిన ర్యాంకుతో ఐఏఎస్ వచ్చే అవకాశం లేదని జయసింహారెడ్డి తెలిపారు. అనిల్‌కుమార్ స్పందిస్తూ గతేడాది 4వ ప్రయత్నంలో 584 ర్యాంకు రాగా, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో అకౌంట్స్ విభాగం కోల్‌కత్తాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నానని, చివర ప్రయత్నంగా ఐఏఎస్ గాని ఐపీఎస్ గానీ వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు.

జనగామ జిల్లాలో ఇద్దరికి ఉత్తమ ర్యాంకు

జనగామ కల్చరల్ / రఘునాథపల్లి: జనగామ జిల్లా నుంచి ఇద్దరు యువకులు సత్తా చాటారు. జిల్లాకేంద్రానికి చెందిన మెరుగు సుజాత - సుధాకర్ దంపతుల కుమారుడైన మెరుగు కౌశిక్ యూపీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 82వ ర్యాంకు సాధించాడు. జనగామలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యనభ్యసించిన కౌశిక్ ఆ తర్వాత హైద్రాబాద్ లో హైస్కూల్ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ లో బీటెక్ పూర్తి చేసి ఢిల్లీ లోని ఐఏఎఫ్‌టీ లో సివిల్ కోచింగ్ తీసుకొని మొదటి ప్రయత్నంలోనే జాతీయ స్థాయి 82వ ర్యాంకు సాధించాడని తల్లిదండ్రులు తెలిపారు. కాగా కౌశిక్ తండ్రి సుధాకర్ 20 ఏళ్లగా హైద్రాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడ్డారు.

నిరుపేద విద్యార్థికి 554వ ర్యాంకు

రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రణయ్ కుమార్ అనే నిరుపేద విద్యార్థి తన రెండో ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్-లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ వలస వెళ్లారు. వారి మూడో కుమారుడైన ప్రణయ్ కుమార్ పదోతరగతి వరకు నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పాలిటెక్నిక్.. గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీ టెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చదివాడు. అనంతరం ఎలాగైనా సివిల్స్ సాధించాలనే పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్టడీ సర్కిల్‌లో చేరి కష్టపడి చదివి రెండవ ప్రయత్నంలో 554వ ర్యాంకు సాధించి సివిల్స్‌కు ఎంపికయ్యాడు. దీంతో ప్రణయ్ కుమార్‌కు ఐఏఎస్ అయ్యే అవకాశం రానుండగా..

గతేడాది యూపీఎస్సీ పరీక్షలో మొదటి సారే ప్రణయ్ కుమార్ 885వ ర్యాంకు సాధించి ఐఎఫ్ఎస్‌కు ఎంపికయ్యాడు. ఈ ర్యాంకుతో ఐఏఎస్ అవకాశం రాకపోవడంతో రెండో సారి ప్రయత్నించగా 554వ ర్యాంకు వచ్చింది. దీంతో ప్రస్తుతం రఘునాథపల్లిలోనే నివాసముంటున్న ప్రణయ్ కుమార్ కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ప్రణయ్ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సాధారణ కుటుంబం నుంచి

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన సయింపు ప్రభాకర్, జయలక్ష్మి కుమారుడు కిరణ్ మంగళవారం యూపీఎస్సీ ఫలితాల్లో 568 ర్యాంకు సాధించారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి ఐపీఎస్‌గా ఎంపిక కానున్న కిరణ్ గతంలో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్(సీఏపీఎఫ్)లో కూడా ఆల్ ఇండియా 15వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి ఐఏఎస్ సాధించటమే లక్ష్యంగా యూపీఎస్సీ పరీక్షకు హాజరయ్యారు. ఈసారి కిరణ్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్) అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అనంతరం ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిగా అవకాశం వచ్చిన కిరణ్ విధులు నిర్వహిస్తూనే చివరి ప్రయత్నంగా మరోసారి యూపీఎస్సీ పరీక్షకు హాజరై 568ర్యాంకు సాధించారు. అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాడు. దీంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ వ్యవసాయకుటుంబానికి చెందిన ప్రభాకర్, జయలక్ష్మి దంపతులకు కుమారుడు కిరణ్, కుమార్తె గిరిజ ఉన్నారు. ఎంతో కష్టపడి ప్రభాకర్ దంపతులు కిరణ్, గిరిజను చదివించగా.. గిరిజ కూడా ట్రిపుల్ ఐటీ చెన్నైలో ఎం.టెక్ పూర్తి చేసి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కిరణ్ 3వ తరగతి వరకు మచ్చాపూర్, 5వ తరగతి వరకు గిర్నిబావి వద్ద గల ఓ ప్రైవేటు పాఠశాలలో చదివాడు. అనంతరం జవహర్ నవోదయ ఎంట్రన్స్ పరీక్ష రాసి వరంగల్ మామునూరు నవోదయ పాఠశాలలో సీటు సాధించాడు. అక్కడ పదోతరగతి పూర్తిచేసిన కిరణ్ గుంటూరు బాష్యం పాఠశాలలో ఇంటర్, ఐఐటీ ఢిల్లీలో 2017లో బీటెక్ పూర్తిచేశాడు. అనంతరం సివిల్స్‌పై దృష్టిపెట్టి విజయం సాధించాడు.

ఐఏఎస్ రాకపోవచ్చు..

రావుల జయసింహారెడ్డి, ఐపీఎస్

గత ఏడాది సివిల్స్ ఫలితాల్లో 217వ ర్యాంకు రాగా ఐపీఎస్ సాధించాను. ఐఏఎస్ కావాలనే ఆశయంతో మళ్లీ సివిల్స్ రాశాను. అయితే ఈ సారి 103వ ర్యాంకు వచ్చింది. జనరల్ కేటగిరీలో ఐఏఎస్ రాకపోవచ్చు. నాకు ఎల్లవేళలా తోడ్పాటును అందిస్తున్న అమ్మానాన్న డాక్టర్ రావుల ఉమారెడ్డి-లకు ఎప్పుడూ విధేయపాత్రుడుగానే ఉంటాను. వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానంలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ రావుల ఉమారెడ్డి కుమారుడే జయసింహారెడ్డి కావడం విశేషం.

ఆఖరి ప్రయత్నంలో సాధించా..

సైంపు కిరణ్‌కుమార్, ఇండియన్ పోస్టల్ సర్వీస్, ఆంధ్రప్రదేశ్

ఐఏఎస్ లేదా ఐపీఎస్ కావాలనే ఉన్నత లక్ష్యంతో చదివాను. ఐఐటీ ముంబై, చెన్నై ఐఐటీల్లో సీటు వచ్చినా సివిల్స్ ప్రిపేర్ కావచ్చుననే ఆశయంతో ఢిల్లీ ఐఐటీలో చేరాను. ఐదో ప్రయత్నంలో రిజర్వ్‌డ్ ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో ఉద్యోగంలో చేరాను. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్టణాల్లో పని చేస్తున్నాను. ఐఏఎస్ లక్ష్యంతో ఆఖరి ప్రయత్నంగా ఆరోసారి సివిల్స్ రాశాను. ఇప్పుడు వచ్చిన ర్యాంకుతో ఐఆర్ఎస్ వచ్చే అవకాశం ఉంది. ప్రజలకు నిరంతరం సేవ అందించడమే నా లక్ష్యం. కాగా, అనంతారానికి చెందిన కిరణ్‌కుమార్ తల్లిదండ్రులు ప్రభాకర్-జయలక్ష్మి రైతులు.

ఐఏఎస్ లక్ష్యంతో ఆఖరి సారి రాస్తాను..

కోటే అనిల్‌కుమార్, డీడీ, ఇండియన్ పోస్టల్ సర్వీసెస్, వెస్ట్‌బెంగాల్

ఇప్పటివరకు 5సార్లు సివిల్స్ రాశాను. నాలుగోసారి వచ్చిన 584 ర్యాంకుతో ఇండియన్ పోస్టల్ సర్వీసెస్‌లో ఎకౌంట్స్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. నిట్ వరంగల్ నుంచి ఇంజనీరింగ్ పట్టా అందుకున్నాక రెండేళ్ల ఏటీఈగా పనిచేశారు. అనంతరం రైల్వేస్‌లో పని చేశారు. గత ఏడాది సివిల్స్‌లో వచ్చిన ర్యాంకుతో ప్రస్తుతం పోస్టల్ సర్వీసెస్‌లో పనిచేస్తున్నారు. ఇప్పటికీ ఐదుసార్లు రాశాను. ఆఖరి ప్రయత్నంగా మరోసారి సివిల్స్ రాసి ఉన్నత లక్ష్యాన్ని సాధిస్తాను.

రేపటి నుంచి 'లోక్‌సభ'

నామినేషన్ల స్వీకరణ

25 వరకు దాఖలుకు అవకాశం

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికలకు గాను గురువారం నోటిఫికేషన్ వెలువడనుండగా.. అదేరోజునుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 25వ తేదీ వరకు దాఖలుకు అవకాశం ఉండగా.. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు. సెలవులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వరంగల్ నియోజకవర్గానికి సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో, మహబూబాబాద్ నియోజకవర్గానికి సంబంధించి మహబూబాబాద్ కలెక్టరేట్‌లో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేస్తోంది.

అభ్యర్థులు పాటించాల్సినవి..

- ఒక్కో అభ్యర్థి నాలుగుసెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉంటుంది. రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందిన వారైతే తప్పనిసరి వారి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్‌వో నుంచి ఓటరు ధృవీకరణ పత్రం సమర్పించాలి.
- అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చు. సంబంధిత బ్యాంకు ఖాతా లావాదేవీల ఆధారంగానే అభ్యర్థులు వ్యయాన్ని లెక్కిస్తారు.
- క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3 ఏలో ఆ వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముంద్రించే విషయంలో సెక్షన్ 127-ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

క్రీడాకారుల వసతిని నిలిపి వేస్తే సహించేది లేదు..

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్16: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ (జేఎన్ఎస్)లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతిని నిలిపివేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వివిధ క్రీడలకు నిలయంగా విరాజిలుతున్న జేఎన్ఎస్‌లో పలురకాల క్రీడలతో పాటు అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాంశాలలో శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో రాణిస్తూ పలు పతకాలను సాధిస్తున్నారన్నారు. రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పలు క్రీడాంశాలలో శిక్షణ పొందుతూ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల వసతి నిలిపి వేసే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నారని తమకు విశ్వసనీయ సమాచారం ఉందన్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులు వసతిని ఎత్తివేసే యోచనను స్పోర్ట్స్ అధికారులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కడియం శ్రీహరి రాజకీయ ద్రోహి

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ● రాజకీయ ఊసరవెల్లి కడియం శ్రీహరి : పల్లా ● మడికొండలో లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మడికొండ, ఏప్రిల్ 16: దేశంలోనే నెంబర్ వన్ రాజకీయ ద్రోహి, నీతిమాలిన రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ కడియం శ్రీహరి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. మడికొండలోని సత్యసాయి గార్డెన్స్‌లో మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన లోక్‌సభ ఎన్నికల స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాజీమంత్రి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఇంత దిగజారిన మోసగాడిని ఇంతవరకు చూడలేదన్నారు. కేసీఆర్ ఆయనకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, ఉపముఖ్యమంత్రి పదవి, ఆయనకు కూతురుకు ఎంపీ టికెట్ ఇచ్చినా పార్టీ మారాడని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని ఎర్రబెల్లి సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. ఒక్కఆర్టీసీ ఉచిత ప్రయాణం అమలు చేశారని, కొద్ది రోజుల తర్వాత అదికూడా ఎత్తేస్తారని జోస్యం చెప్పారు. నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని దయాకర్‌రావు తెలిపారు. శాసన మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ... తెలంగాణ రాజకీయాల్లో ఎవరు దొంగ అంటే కడియం శ్రీహరి పేరు చెబుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బీఫామ్‌తో గెలిచిన కడియం శ్రీహరి.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఒకవైపు, కాంగ్రెస్ పార్టీ మరోవైపు రెండు పార్టీలు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు అవుతున్నాయో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీలు మారడం చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతోందన్నారు. ద్రోహం అంటేనే కడియం శ్రీహరి అన్నారు. 2023లో ఎదురు గాలి వీచినా స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు గులాబీ జెండాను చూసి కడియంను గెలిపించారన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య, తాను అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని పేర్కొన్నారు. జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ రెండు నియోజకవర్గాలను రెండు కళ్లుగా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఇప్పుడు జరుగుతున్న ఎన్నిక ఒక మోసగాడికి, ఒక నీతిమంతుడికి జరుగుతున్న పోరు అని తెలిపారు. సుధీర్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించి ఢిల్లీకి పంపుదామని స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య మాట్లాడుతూ.. కడియం శ్రీహరి ఒక నీచుడు, నికృష్టుడు, దుర్మార్గుడు.. దేశం మొత్తంలోనే ద్రోహి అని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా రాజయ్య ఉద్వేగానికి గురయ్యారు. తాను కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటే శ్రీహరి కంట్ల పెట్టుకుని బాధపెట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తన ఎమ్మెల్యే పదవి, ఎంపీ పదవి, ఉప ముఖ్యమంత్రి పదవి అన్నీ లాక్కున్న నికృష్టుడని, దళిత ద్రోహి అని మండిపడ్డారు. అవినీతిలో పెద్ద తిమింగలం అన్నారు. శ్రీహరిని ధర్మసాగర్ చెరువులో తొక్కితే పాకిస్తాన్‌లో తేలాలన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఆయనకు ఉన్న ఆస్తులు.. ఇప్పుడు ఉన్న ఆస్తులు లెక్కచూడాలని అన్నారు. ఇక నుంచి కడియంను ప్రతీచోట నిలదీస్తామని, ఎక్కడైనా ఢీకొనేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు. నిజాయితీపరుడైన సుదీర్‌కుమార్‌ను గెలిపించుకోనేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఇది నీతికి, అవినీతికి మధ్య జరుగుతున్న పోరాటమని, నీతికి పట్టం కట్టి విలువలు కలిగిన రాజకీయాలని కాపాడుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కావ్య గెలుపులో ఎన్ఎస్‌యుఐ కీలక పాత్ర పోషించాలి

వరంగల్ లోక్‌సభ ఎన్నిక, ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి


మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 16: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య గెలుపులో ఎన్ఎస్‌యూఐ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్డులో వరంగల్ లోక్‌సభ ఎన్నిక, ఎన్ఎస్‌యూఐ సన్నాహక సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ సతీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా రోహిత్ చౌదరితో పాటు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా రోహిత్ చౌదరీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో అగ్రనేత రాహుల్‌గాంధీ యువతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. విద్యా రుణాల వడ్డీమాఫీ, ఏటా 30లక్షల ఉద్యోగాల భర్తీ ఇలా యువతకు ప్రయోజనం చేకూరే హామీలు ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ శ్రేణులు గ్రామీణ ప్రాంతాల నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఇంటింటికీ మేనిఫెస్టో తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా విద్యారంగ సంస్థలను కూడా సందర్శించి యువతకు వివరించాలన్నారు. పార్టీ కోసం శ్రమించే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఇందుకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిదర్శనమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు లోక్‌సభ ఎన్నికలో రెండు, మూడు స్థానాల కోసమే పోటీపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రజల్లో విశ్వాసం సడలిందన్నారు. రాహుల్‌గాంధీని ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య విషయంలో బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే ఊరుకోమని, బట్టలూడదీసి కొడతామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. బీజేపీ పుట్టక ముందే రాముడు దేశ ప్రజలకు దేవుడని స్పష్టం చేశారు. బీజేపీని గద్దె దించడానికి ఎన్ఎస్‌యూఐ శ్రేణులు సైనికుల్లా పోరాడాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే పార్టీ తప్పక ఆదరిస్తుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు పల్లంకొండ సతీశ్ వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నో దౌర్జన్యాలను ఎదుర్కొన్నామన్నారు. ప్రతీ విషయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అండగా ఉన్నారన్నారు. డాక్టరు కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. బీజేపీకి ధనబలం ఉంటే కాంగ్రెస్‌కు జనబలం ఉందని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కావ్య అన్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ కబ్జాల చరిత్రను ప్రజలు మరువలేదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికే ప్రమాదకరమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎన్ఎస్ యూ, యూత్ కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల రమాకాంత్‌రెడ్డి, చందనరెడ్డితో పాటు కత్తి వెంకటస్వామి, బంక సరళ, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, సునితా ఆనంద్, మోజెస్ ఆనంద్, డాక్టర్ శ్రవణ్, బంక సంపత్ యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



నేడు దేవాలయ ముఖద్వారం ప్రారంభం

వరంగల్‌సిటీ, ఏప్రిల్ 16: నగరంలోని 19వ డివిజన్ ఓసిటీ రోడ్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయ ముఖద్వారాన్ని భూక్యా మంగమ్మ -యాకూబ్ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు భూక్యా మోతీలాల్ నాయక్ యూన్సీ దంపతులు నిర్మించారు. శ్రీరామ నవమి మహోత్సవాన్ని పురస్కరించుకుని దాతలు మోతీలాల్ నాయక్ కుటుంబం బుధవారం ఉదయం ప్రారంభించనున్నారు.



మంగళవారం రాత్రి ఎదుర్కోళ్ల ఉత్సవ

కన్నుల పండువగా ఎదురుకోలు

ఘనంగా గోవిందరస్వామి తిరుకల్యాణోత్సవం

గిర్మాజిపేట, ఏప్రిల్ 16: వరంగల్ నగరంలోని శ్రీదేవి భూదేవినీళాదేవి సమేత శ్రీగోవింద రాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీగోవిందరాజస్వామి తిరుకల్యాణోత్సవంలో భాగంగా ఎదురుకోలు కన్నుల పండువగా జరిగింది. కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, దేవాలయ కార్యనిర్వాహణాధికారి రత్నాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో గుట్ట వద్ద నుంచి కోలాట బృందాల నృత్యాలతో ప్రారంభమైన ఉత్సవం గరిమీళ్లవారి వీధిలో జరిగింది. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సోమరాతి సత్యనారాయణ,మాజీ డైరెక్టర్ రాజేశ్వరి, రాజాకృష్ణ, చింతాకుల సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్.. రాములోరి కల్యాణానికి..

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి

నగరంలో ముస్తాబైన ఆలయాలు

ఖిలావరంగల్, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి పురస్కరించుకుని సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం చేశారు. బుధవారం శ్రీ పంచముఖ నాగవీరేశ్వరాలయంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు శివశ్రీ భోగేశ్వరశాస్త్రి, దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం చెన్నారెడ్డికాలనీ, లేబర్ కాలనీలోని పంచముఖనాగవీరేశ్వరాలయంలో కల్యాణ పోస్టర్‌ను దేవాలయ ప్రధాన కార్యదర్శి మాడిమాల రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్త ఆరుగొండ భూదేవి, సహాయ అర్చకుడు కిరణ్ శాస్త్రి, గజవెళ్లి లక్ష్మయ్య, పారుపెల్లి రాజేందర్, మూడెడ్ల సతీష్, ఆరుగొండ పూర్ణచందర్, అరుణ్, బాస్కుల సురేందర్, సమ్మెటి వేణు, కందుల సంపత్ పాల్గొన్నారు. మెట్టుకోటలోని ఆంజనేయస్వామి దేవాలయంలో, తూర్పుకోటలోని హనుమాన్ దేవాలయం, ఖమ్మం రోడ్ వద్ద గల శివశక్తి వినాయక మందిర్, శివనగర్‌లోని రామాలయంలో, పుప్పాలగుట్టలోని ముత్యాలమ్మ దేవాలయం తదితర ప్రాంతాలలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



సిద్ధమైన శంభునిపేటలోని కార్యసిద్ధి హనుమాన్ దేవాలయం

- కరీమాబాద్: రంగశాయిపేటలోని ప్రాచీన రామాలయంలో మంగళవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కరీమాబాద్‌లోని రామస్వామి దేవాలయం, ఉర్సు శివాంజనేయస్వామి దేవాలయం, శంభునిపేటలోని కార్యసిద్ధి హనుమాన్ దేవాలయంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో, విశ్వనాథ్‌కాలనీలో అభయాంజనేయస్వామి దేవాలయం, గణేష్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో నేడు వేడుకలను నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.
- గీసుగొండ: సీతారాముల కల్యాణోత్సవానికి మండలంలోని పలు ఆలయాలను మంగళవారం అందంగా ముస్తాబు చేశారు. కొనాయిమాకుల వద్ద గల ప్రముఖ సీతారామ క్షేత్రం(పంచముఖ అంజనేయస్వామి ఆలయం)లో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. అలాగే గీసుకొండలోని శివాలయంలో, ధర్మారంలోని రామలింగేశ్వర ఆలయం, రెడ్డిపాలెంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో వివాహ వేడుకల కోసం మామిడి తోరణాలు, చలువ పందిళ్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



లేబర్‌కాలనీలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అర్చకులు



మల్లెపూల అలంకరణలో ఊకల్ నాగేంద్రుడు

గీసుగొండ, ఏప్రిల్ 16: మండలంలోని ఊకల్‌లో గల నాగసుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో వసంత రుతువు, శ్రీరామ నవమి నవరాత్రుల సందర్భాన్ని పుష్కరించుకొని మంగళవారం స్వామివారికి మల్లెపూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు వేసవి తాపాన్ని తట్టుకొని ఆరోగ్యంతో ఉండాలని పూజలు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, ఎంపీటీసీ వీరారావు, భక్తులు పాల్గొన్నారు.

బస్సులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 16: బస్సులు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మెట్టుపల్లిలో విధులు నిర్వహిస్తున్నాడు. నిజామాబాద్ జిల్లా మెట్టుపల్లి ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఇతనికి అనారోగ్యంగా ఉందని, వరంగల్ వరకు తీసుకెళ్లండని నర్సంపేటకు వస్తున్న బస్సులో ఎక్కించారు. వరంగల్ బస్టాండ్‌కు బస్సు అర్ధరాత్రి 1.20 గంటలకు చేరుకోగా కండక్టర్ ప్రయాణికులను దిగండని చెప్పగా గుర్తు తెలియని వ్యక్తి ఎంతకు లేవకపోవడంతో బస్టాండ్ కంట్రోలర్‌కు సమాచారం అందించారు. కంట్రోలర్ 100 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమా చారం అందించారు. వెంటనే బస్సును ఎంజీఎం



ఆస్పత్రికి పోలీసుల సహాయంతో తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఎంజీఎంలో భద్రపర్చారు. ఏమైనా సమాచారం తెలిస్తే ఇంతేజార్‌గంజ్ ఎస్‌హెచ్‌వో :8712685118 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు కోరారు. మృతుడి నుంచి ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఆంధ్రకు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్టు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

సంగెం, ఏప్రిల్ 16 : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మామునూరు ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం. తిమ్మాపురం హవేలి గ్రామానికి చెందిన కొత్తపల్లి సుజాత (62) భర్త గతంలోనే మృతి చెందాడు. సంతానం లేకపోవడంతో గ్రామంలో బర్రెలను కాస్తూ ఒంటరిగా జీవిస్తోంది. కాగా మంగళవారం రాత్రిరోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా, హనుమకొండ జిల్లా కమలాపూర్ సమీపంలోని అంబాలకు చెందిన యువకుడు బోయిన శివకుమార్ బైక్‌తో బొల్లికుంట వైపు వెళ్తూ మధ్యాహ్నం ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సుజాతను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సుజాత మృతదేహం

హద్దుమీరుతున్న ఆగడాలు

నగరంలో ఆకతాయిల హల్‌చల్

రోడ్లపై బైక్ రైడ్‌లతో విన్యాసాలు

శృతి మించుతున్న వాహన శబ్దాలు

అతివేగంతో వాహనదారుల బెంబేలు

మట్టెవాడ, ఏప్రిల్ 16: నగరంలోని ప్రధాన రోడ్లపై ఆకతాయిల ఆగడాలు రోజురోజుకు శృతి మించిపోతున్నాయి. రహదారులపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలపై దూకుడు ప్రదర్శిస్తున్నారు. వాహనాలతో విన్యాసాలు చేస్తూ మితిమీరిన వేగంతో వెళ్తుండటంతో ఇతర వాహనదారులు భీతిల్లి పోతున్నారు. వీరి తీరు ఇతరులకు ప్రాణ సంకటంగా మారుతోంది. పోలీసులు పూర్తిస్థాయిలో వీరిని అరికట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత రద్దీ ప్రాంతాల్లో స్పీడ్‌గా బైక్ నడిపి ఒక్కసారిగా తగ్గించకపోవ డంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై దూసుకెళ్తూ ప్రజల ప్రాణాలతోనూ చెలగాట మాడుతున్నారు.

పేట్రేగిపోతున్న ఆకతాయిలు

వరంగల్ నగరంలో ప్రధాన రహదారులపై ఆకతాయిలు అతివేగంతో వాహనాలతో దూసుకెళ్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను సైతం లెక్కచేయకుండా వెళ్తున్నారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు కారణమవుతున్నారు. వరంగల్‌లోని నర్సంపేట రోడ్డు, ఎంజీ రోడ్డు, పోచమ్మ మైదాన్ జంక్షన్, మండిబజార్, దేశాయిపేట రోడ్డు, ఎల్బీనగర్ రోడ్డు, కాశిబుగ్గ ఓసిటీ రోడ్డు, మార్కెట్ రోడ్డు, ఎస్వీఎన్ రోడ్డు, పోతనరోడ్డు, ఎంజీఎం జంక్షన్ నుంచి ములుగురోడ్డు జంక్షన్, హంటర్‌రోడ్డు, ఏనుమాముల మార్కెట్ 100 ఫీట్ల రోడ్డు, ఉర్సుగుట్ట రోడ్డు, చింతల్ బ్రిడ్జి, ఫోర్ట్‌రోడ్డు, నగరంలోని అంతర్గత రోడ్లపై అధిక సామర్థ్యం ఉన్న ఇంజన్లు కలిగిన అత్యాధునిక ద్విచక్ర వాహనాలతో అతివేగంగా వాహనాలు నడుపుతున్నారు. వాహనాలతో రోడ్డుపైకి ఒక్కసారిగా దూసుకొచ్చి వేగంపెంచడంతో ఇతర వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరి వికృత చేష్టలు ఇతర వాహనదారులకు ప్రమాదకరంగా మారు తున్నారు.

పెద్దగా వాహన శబ్దాలు..

నగరంలో నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ రోడ్డు, వెంకట్రామ జంక్షన్, తెలంగాణ జంక్షన్, కాశిబుగ్గ జంక్షన్, పోచమ్మ మైదాన్ జంక్షన్, అండర్ బ్రిడ్జి రోడ్డు, బట్టల బజార్ బ్రిడ్జి రోడ్డులో కొందరు యువకులు వాహనాలతో రోడ్లపైకి అతివేగంగా దూసుకెళ్తూ వింత హారన్‌లతో శబ్ధాలు చేయడంతో ఇతర వాహనదారులు ఉలిక్కిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోపక్క ఒక్కొక్క ద్విచక్ర వాహనంపై ముగ్గురు, నలుగురు ప్రయాణాలు సాగిస్తూ వాహన సైలెన్సర్‌తో పెద్ద పెద్ద శబ్ధాలు చేస్తూ అతివేగంగా నడుపుతున్నారు.

బైక్ రేసులు..

నగరంలోని నర్సంపేట రోడ్డు, హంటర్‌రోడ్డు, ములుగురోడ్, ఆర్‌టీఏ జంక్షన్, ఉర్సుగుట్ట రోడ్డు, ఏనుమాముల 100 ఫీట్ల రోడ్డులో రాత్రి సమయంలో కొందరు యువకులు బైక్ రేస్‌లు నిర్వహిస్తున్నారని స్థానిక ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు, లాండ్ అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపై విన్యాసాలు, అతివేగంగా వాహనాలు నడిపే వారికి బ్రేక్ పడే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వాహనాల హారన్‌లు, బైక్‌ల సైలెన్సర్ల శబ్ధాలను నియంత్రించాలని కోరుతున్నారు.



రోడ్డుపై వాహనంతో విన్యాసం (ఫైల్)

ఫైనాన్స్ వాణిజ్య కమిటీ సభ్యుడిగా నారాయణరావు

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 16: దక్షిణ భారత ప్రాంతీయ మండలి పబ్లిక్, ప్రభుత్వ ఫైనాన్షియల్ కమిటీ కో ఆప్టెడ్ సభ్యులుగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు నియమితులయ్యారు. దశాబ్దాలుగా చార్టర్డ్ అకౌంటెంట్‌గా సేవలందిస్తున్న నారాయణరావు సేవలను గుర్తిస్తూ 2024-25 సంవత్సరానికి గాను నియామకం చేసినట్లు సిర్క్ చైర్ పర్సన్ గీత ఉత్తర్వులు జారీ చేశారు. ప్రపంచ స్థాయిలో పేరెన్నికగన్న దక్షిణ భారత ప్రాంతీయ మండలి దేశ ఆర్థిక వ్యవస్థ మూల స్తంభంగా అమూల్యమైన సేవలందిస్తున్న సంస్థ అని అన్నారు. ఈ పదవిలో నియమితులైన పీవీ నారాయణరావును ఉమ్మడి జిల్లాలోని సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్లు, పలువురు అభినందనలు తెలిపారు.



బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

రాంనగర్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరంగల్ లోక్‌సభకు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం నియమించారు. పరకాల నియోజకవర్గానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పాలకుర్తికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్టు శ్రీనివాస్, స్టేషన్ ఘనపూర్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వరంగల్ వెస్ట్‌కు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, సంగంరెడ్డి సుందర్‌రాజ్, వరంగల్ ఈస్ట్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్ధన్నపేటకు కె.వాసుదేవరెడ్డి, సాంబారి సమ్మారావుకు, భూపాలపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నియామకమయ్యారు.

వేధించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16: ఉపాధ్యాయురాలిని వేధించిన సంఘటనలో మరో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసచారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే ఖానాపురం మండలం బుధరావుపేటలోని మోడల్ స్కూల్లో ఈనెల 10న ఎ.హారిక అనే ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన విదితమే. ఆమె ఆత్మహత్యాయత్నానికి అదే పాఠశాలలో పనిచేస్తున్న పీజీటీ సివిక్స్ ఉపాధ్యాయుడు డి.రాజేందర్ వేధింపులే కారణమని డీఈవో పంపించిన మండల నోడల్ అధికారి విచారణ నివేదిక ఆధారంగా రాజేందర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

ఖానాపురం, ఏప్రిల్ 16: బుధరావుపేట ప్రభుత్వం మోడల్ పాఠశాలలో తోటి ఉపాధ్యాయుడు దామెర రాజేందర్ వేధింపులతో సైన్స్ ఉపాధ్యాయురాలు హారిక ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సదరు ఉపాధ్యాయుడిపై నేటి వరకూ చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఉదయం పాఠశాల గేట్‌కు తాళం వేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మోడెం ఎల్లగౌడ్, సింగు సుధాకర్, మాచర్ల ప్రేమ్‌చంద్, పెద్దపెల్లి సంపత్, కొడిమాల సారంగం, యోగానందచారి, పొల్కం శ్రీనివాస్, సురేశ్ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యా యులు పాఠశాలలో గ్రూపులుగా ఏర్పడి గొడవలు పడుతూ విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు పాఠశాలలో జరిగి న ఘటనపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని విద్యావ్యవస్థను పరిరక్షించాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో గేటు తాళం తీశారు.



గేట్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

5వ పేజీ తరువాయి

చేకూరేలా జనగణన చేపట్టాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం, దేశావృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

ప్రజలకు సమన్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరణ చేయాలని బీజేపీ ప్రభుత్వం చేసి ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుందని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ పాంచ్‌న్యాయ్ పేరుతో దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. 30లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భూకబ్జాదారుడైన అరూరి రమేష్‌ను గెలిపిస్తే ఇక్కడి సంపదను కూడా ఆయన దోచుకువెళ్తారని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి, నాగరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఎన్నికలు ముగియగానే రూ.100కోట్లతో భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌ల ప్రదానం

గీసుగొండ, ఏప్రిల్ 16: ధర్మారం జెడ్పీ పాఠశాలలో 2022-24 సంవత్సరంలో ఎన్‌సీసీ కోర్సు పూర్తిచేసిన క్యాడెట్‌లకు సర్టిఫికెట్‌లను చీఫ్ ఆఫీసర్ రవిందర్ మంగళవారం ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ మ్యాప్ రీడింగ్, బ్యాటిల్ క్రాఫ్ట్, ఫీల్డ్‌క్రాఫ్ట్, ఫైరింగ్, యోగా, సామాజిక సేవా, క్రమశిక్షణ తదితర అంశాలను క్యాడెట్‌లకు నేర్పించి అనంతరం నిర్వహించిన ప్రతిభ పరీక్షలో క్యాడెట్‌లు ప్రతిభ కనబరిచారన్నారు. ఆర్మీ వింగ్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ అజయ్‌నంద్ కందూరి ఆదేశానుసారంగా సర్టిఫికెట్‌లను అందించినట్లు రవిందర్ చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మట్టెవాడ, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వరంగల్ అగ్ని మాపక కేంద్రం ఇన్‌చార్జి రవీందర్ అన్నారు. మంగళవారం అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా వరంగల్ ఓసిటీలోని క్లాసిక్ రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో మహిళలకు అగ్నిమాపక నివారణపై అవగాహన కల్పించారు. ఎల్‌పీజీ గ్యాస్ సెఫ్టీపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ రవీందర్, ఎల్ఎఫ్ మాధవరెడ్డి, డీఓపీ గంగాధర్, ఫైర్ సిబ్బంది రాజేందర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ-తెలంగాణ అసోసియేట్ అధ్యక్షుల ఎన్నిక

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16: పీఆర్టీయూ-తెలం గాణ రాష్ట్ర, జిల్లా అసోసి యేట్ అధ్యక్షులను నియమి స్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, సత్యనారాయ ణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు చెం దిన ఉపాధ్యాయుడు నాగబండి రమేష్‌ను రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షులుగా, జి.కిషన్‌ను వరంగల్ అసోసియేట్ అధ్యక్షులుగా నియమించినట్లు వారు ప్రకటనలో పేర్కొన్నారు.



రమేష్



కిషన్



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 17 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి



నల్లబెల్లిలో ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 16: ఎరువుల షాపుల్లో, వరి కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి ఉషా దయాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు రేలకుంట, రంగాపురం, మేడపల్లి గ్రామాల్లో ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. వరి నాణ్యత ప్రమాణాలపై, భూసార పరిరక్షణ పై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వేసవి కాలంలో భూములను లోతుగా దున్నుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనాలు ఉంటాయో రైతులకు వివరించారు. ఆమె వెంట అధికారులు సారంగం, సి.హెచ్ కృష్ణారెడ్డి, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

ఖానాపురం, ఏప్రిల్ 16: ఎండవేడిమి తీవ్రంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీని) ఆయన సందర్శించారు. రికార్డులను, ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీతో పాటు హెల్త్ సబ్ సెంటర్లలో, ఆశాకార్యకర్తల వద్ద, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రుచిత, కల్పన, రాజేశ్, సిబ్బంది మంగమ్మ, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి: దుగ్గొండి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవల తీరును మంగళవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తనిఖీ చేసి పరిశీలన చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎండలో తిరుగరాదని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డాక్టర్ కిరణ్‌రాజు, సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో సాంబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఆలయాల ముస్తాబు

నెక్కొండ, ఏప్రిల్ 16 : నేడు అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించుటకు నెక్కొండ మండలంలోని శ్రీరామలింగేశ్వరస్వామి, అంజనేయస్వామి ఆలయాలను మంగళవారం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ముస్తాబు చేశారు. నెక్కొండలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, బొడ్రాయివద్ద ఆంజనేయస్వామి ఆలయం, శ్రీపంచముఖాఅంజనేయస్వామి ఆలయం, బొల్లికొండ, దీక్షకుంట, గుండ్రపల్లి, పెద్దకోర్పోలు, గుడితండా గ్రామాల్లోని రామాలయాలకు రంగులు వేసి, విద్యుత్ కాంతులతో ముస్తాబులు చేశారు. అలాగే రాములోరి వివాహ వేడుకలకు హాజరవుతున్న భక్తుల కోసం ఎండ వేడిమిని తట్టుకొనుటకు చలువ పందిళ్లను, తాగు నీటి ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేస్తామని ఆలయాల కమిటీల చైర్మన్‌లు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, బెజ్జంకి వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి సంపత్‌రావులు తెలిపారు. మండలంలోని బొల్లికొండ గుట్టపైన శ్రీసీతారామకల్యాణోత్సవం తరువాత నిర్వహించే జాతరలో పాల్గొనే భక్తులకు నిర్వహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని శ్రీసీతారామంజనేయ స్వామి ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలోని శ్రీ రామ నవమి వేడుకల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో ఆవరణలో చలువ పందిళ్లను వేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సౌకర్యం కల్పించటంతో పాటు ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



చెన్నారావుపేటలో ముస్తాబైన రామాలయం

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

పాఠశాల గేటుకు తాళం వేసి తల్లిదండ్రుల నిరసన

ఖానాపురం, ఏప్రిల్ 16: మండలంలోని బుధరావుపేట ప్రభుత్వం మోడల్ పాఠశాలలో తోటి ఉపాధ్యాయుడు దామెర రాజేందర్ వేధింపులతో సైన్స్ ఉపాధ్యాయురాలు హారిక ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సదరు ఉపాధ్యాయుడిపై నేటి వరకూ చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఉదయం పాఠశాల గేట్‌కు తాళం వేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మోడెం ఎల్లగౌడ్, సింగు సుధాకర్, మాచర్ల ప్రేమ్‌చంద్, పెద్దపెల్లి సంపత్, కొడిమాల సారంగం, యోగానందచారి, పొల్కం శ్రీనివాస్, మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు పాఠశాలలో గ్రూపులుగా ఏర్పడి గొడవలు పడుతూ విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారన్నా రు. మహిళా ఉపాధ్యాయురాలిపై వేధింపులకు పాల్పడ్డ ఉపాధ్యాయుడిపై నేటి వరకూ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో తమ పిల్లలకు రక్షణ ఎలాఉంటుందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారి పై చర్యలు తీసుకుని విద్యావ్యవస్థను పరిరక్షించాలని పాఠశాల ప్రిన్సిపాల్ సదాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో గేటు తాళం తీశారు.

ఉపాధ్యాయురాలిని వేధించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

వరంగల్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయురాలిని వేధించిన సంఘటనలో మరో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస చారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే ఖానాపురం మండలం బుధరావుపేటలోని మోడల్ స్కూల్లో ఈనెల 10న ఎ.హారిక అనే ఉపాధ్యాయురాలు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన విదితమే. ఆమె ఆత్మహత్యాయత్నానికి అదే పాఠశాలలో పనిచేస్తున్న పీజీటీ సివిక్స్ ఉపాధ్యాయుడు డి.రాజేందర్ వేధింపులే కారణమని డీఈవో పంపించిన మండల నోడల్ అధికారి విచారణ నివేధిక ఆధారంగా రాజేందర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి పేర్కొన్నారు.

మాదన్నపేట ఆయకట్టు రైతులకు నీటిని అందించాలి



మాదన్నపేట చెరువు నీటిని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట, ఏప్రిల్ 16 : నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు కింద యాసంగిలో రైతులు సాగుచేసుకున్న వరిపంటలకు సాగునీరు అందించాలని జిల్లా కలెక్టర్‌ను జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావులు కోరారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మాదన్నపేట చెరువులో నిలువ ఉన్న నీటి సామార్థ్యాన్ని మంగళవారం నీటిపారుదల శాఖ ఈఈ సల్మాన్‌రాజ్, డీఈ రాం ప్రసాద్, రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. చెరువులో ఉన్న నీరు పంటలకు సరిపోయేలా లేదని దీంతో ఆయకట్టు పంటలు ఎండి పోయే పరిస్థితులు నెలకొన్నాయని వారు ఫోన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. చేతికందే దశలో ఉన్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున ఆయకట్టు రైతులు సాగుచేసిన వరిపంటను కాపాడేందుకు సాగునీటిని అందించాలన్నారు. అవసరమైతే చెరువులో మోటార్ల ద్వారా తూము నుంచి కాలువలోకి నీటిని తరలించే విధంగా చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరినట్లు రవీందర్‌రావు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేములసాంబయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మేరుగు సాంబయ్య, గందం నరేందర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

అరాచక పాలన నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

(5వ పేజీ తరువాయి)

చేకూరేలా జనగణన చేపట్టాలని రాహుల్ గాంధీ ఆకాంక్ష అన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం, దేశావృద్ధి సాధ్యమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. .

సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎంపీ అభ్యర్థి కడియం కావ్య

ప్రజలకు సమ న్యాయం జరగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరణ చేయాలని బీజేపీ ప్రభుత్వం చేసి ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుందని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ పాంచ్‌న్యాయ్ పేరుతో దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. 30లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భూకబ్జాదారుడైన అరూరి రమేష్‌ను గెలిపిస్తే ఇక్కడి సంపదను కూడా ఆయన దోచుకువెళ్తారని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, యశస్వినిరెడ్డి, నాగరాజు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఎన్నికలు ముగియగానే రూ. 100 కోట్లతో భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 16 : నర్సంపేట మండలం గురిజాల పీఏసీఎస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఆకుల రమేష్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి తనకు పార్టీ సమావేశాల్లో గానీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో గానీ సముచిత స్థానం కల్పించకుండా పలు సందర్భాలలో అవమానపరచడం జరిగిందని దీంతో తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకంలో ప్రొటోకాల్ ప్రకారం తన పేరు పెట్టకపోవడం తనను కలిచివేసిందన్నారు. ఇంత జరుగుతున్నా పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్టీ క్యాడర్‌ను మందలించలేదన్నారు. పార్టీలో గౌరవ మర్యాదలు లేకపోవడంతో మనస్థాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని, భవిష్యత్ కార్యచరణను త్వరలోనే ప్రకటిస్తానని రమేశ్ తెలిపారు.

సొసైటీ చైర్మన్ రాజీనామా

దుగ్గొండి, ఏప్రిల్16: మండలంలోని మందపల్లి గ్రామ సొసైటీ చైర్మన్ చాపలబండకు చెందిన గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్మీలో పని చేసి రిటైర్డు అయిన అనంతరం ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశీస్సులతో సొసైటీ చైర్మన్‌గా గెలువడం జరిగిందని, బీఆర్ఎస్ పార్టీలో గ్రామ, మండల నాయకుల మధ్య గ్రూపు తగాదాలు ఉండడం, ప్రొటోకాల్ పాటించకపోవడంతో అవమానాలకు గురి కావడం జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి 4నెలలు గడిచినా ఇప్పటికీ సమన్వయం చేయక పోవడంతో బీఆర్ఎస్‌కి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

బీజేపీ గెలుపు తథ్యం

రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 16 : వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మూడో వార్డులో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీతో దేశ అభివృద్ధి సాధ్యమని గుర్తు చేశారు. మండలంలోని ఇల్లందలో మండల బీజేపీ అధ్యక్షుడు రాయపురపు కుమాస్వామి ఆధ్వర్యంలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి కృష్ణమూర్తి, పెండంట మహంత్, దూడయ్య, సాతుపెల్లి ఎల్లయ్య, గిరిప్రసాద్, దివనేశ్, విక్కీ, వేణు, గణేశ్, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న శ్రీధర్

● రాయపర్తి : వరంగల్ ఎంపీ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపే లక్ష్యంగా మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో బీజేపీ యువ మోర్చా పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోరంట్ల ప్రభాకర్, బూత్ కమిటీ సభ్యులు యాకూబ్, షైబు, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 16: మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికలు ప్రశాతం వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య కోరారు. మంగళవారం పట్టణంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేసే ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ఎవరు ప్రయత్నం చేసి ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్యప్రకాశ్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, సీఆర్పీఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సూచించారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో దాహం తీర్చడం ఎంతో ముఖ్యమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అనేక పనుల నిమిత్తం నిత్యం వర్ధన్నపేటకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోరెందుల కుంట శిఖం భూములను పరిరక్షించాలి

ఉపాధిహామీ పనులు కల్పించాలని కూలీలన నిరసన

ఖానాపురం, ఏప్రిల్ 16: మండలంలోని రాగంపేట శివారులోని కోరెందుల కుంట శిఖం భూములు ఆక్రమణకు గురయ్యాయిని వాటిని పరిరక్షించి ఉపాధి హామీ పనులు చేపట్టాలని కోరుతూ మంగళవారం రాంగపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు బీరయ్య, సాంబయ్య, స్వామి, బిచ్చా, వెంకన్న, కుమారస్వామి మాట్లాడుతూ కోరెందుల కుంట శిఖం భూములను కొందరు రైతులు ఆక్రమించారని తెలిపారు.

ఉపాధి కూలీలు కుంటలోని మట్టిని తవ్వడానికి వెళ్లగా కుంట సమీపంలోని రైతులు(ఆక్రమణదారులు)ట్రాక్టర్లను తమ పొలాలమీదుగా వెళ్లకుండా అడ్డుకోవడంతో కూలీలు నిరసన వ్యక్తం చేశారు. ఆక్రమణకు గురైన కుంట శిఖం భూములను పరిరక్షించి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కుంటను సందర్శించిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



దివ్య (ఫైల్)

ఖానాపురం, ఏప్రిల్ 16: మండలంలోని మంగళవారిపేట గ్రామానికి చెందిన కుసుమ దివ్య(30) అనే వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి మంగళవారం తెలిపారు. మంగళవారిపేట గ్రామానికి చెందిన కుసుమ సతీష్‌కు చెన్నారావుపేట మండలం లింగగిరికి చెందిన దివ్యతో 2013లో వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో దివ్య సోమవారం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో దివ్య తండ్రి దాసరి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దివ్య ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు లైట్ గ్రీన్ కలర్ చీర ధరించినట్లు వివరించారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో 8712485234, 8712685025 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

వృథాగా తాగునీరు



ద్వారకపేట రోడ్‌లో రోడ్డు పక్కన వృథాగా పోతున్న తాగునీరు

నర్సంపేట, ఏప్రిల్ 16 : మిషన్ భగీరథ పైపులైన్లు రోజూ ఏదో ఒక వార్డులో తరచూ పగిలి తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్మాణం పూర్తయిన వాటర్‌ట్యాంక్ నుంచి నీటిని ద్వారకపేట రోడ్ గుండా కాకతీయ కళాశాల సమీప వీధి వరకు తాగునీటి సరఫరా కోసం ట్రయల్‌రన్ నిర్వహించారు. ద్వారకపేట రోడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో మిషన్‌భగీరథ పైపులైన్ పగిలి నీరంతా రోడ్డుపై, సమీప ఇళ్ల ముందు వరదలా ప్రవహించింది. అలాగే కాకతీయ కళాశాల సమీపంలో కూడా పైపుపగిలి నీరు లీకేజీ అయి వృథాగా నీరు రోడ్డుపై ప్రవహించింది. మునిసిపల్ అధికారులు స్పందించి పగిలినపాత పైపులైన్‌కు మరమ్మతులు చేసి భగీరథ నీరు వృథాగా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పంట దగ్ధం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 16 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన నర్సంపేట మండలంలోని పర్శనాయక్‌తండాలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన కొర్ర శోభన్ తనకున్న ఎకరన్నర భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట చేతికందే సమయంలో మంగళవారం పంట చేనుపై నుంచి వెళ్తున్న 11కేవీ వైర్లు షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి పంట దగ్ధమైంది. పంటతో పాటు పొలంలో ఉన్న రెండు బోర్లు, 5హెచ్‌పీ మోటార్ కాలిపోయాయి. దీంతో రూ. 4 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు శోభన్ కోరాడు.

యువత 'మత్తు'కు బానిసలు కావొద్దు

నెక్కొండ, ఏప్రిల్ 16 : యువత మత్తు పదార్థలకు బానిసలు అయితే వారి జీవితం పాడవుతుందని నెక్కొండ సీఐ చంద్రమోహన్ అన్నారు. యాంటినార్కటిక్ బ్యూరో, యాంటి డ్రగ్స్ నివారణ వాల్ పోస్టర్లను మంగళవారం నెక్కొండలోని తహసీల్దార్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసలుగా మారడం వల్ల కలిగే అనార్థాల గురించి వివరించారు. మత్తుపదార్థాలు సేవించిన, విక్రయించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై మహేందర్, సొసైటీ సీవో మోడం సురేశ్ పాల్గొన్నారు.

ప్రజల దాహం తీర్చుటకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని నెక్కొండ సీఐ చంద్రమోహన్, తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. నెక్కొండలోని నవత ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసి న చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, ఆటోయూనియన్ అధ్యక్షుడు మోడం సురేశ్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమన్వయకర్తల నియామకం

రాంనగర్, ఏప్రిల్ 16: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరంగల్ లోక్‌సభకు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం నియమించారు. పరకాల నియోజకవర్గానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, పాలకుర్తికి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మెట్టు శ్రీనివాస్, స్టేషన్ ఘనపూర్‌కు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వరంగల్ వెస్ట్‌కు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, సంగంరెడ్డి సుందర్‌రాజ్, వరంగల్ ఈస్ట్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్ధన్నపేటకు కె.వాసుదేవరెడ్డి, సాంబారి సమ్మారావుకు, భూపాలపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నియామకమయ్యారు.

నిరుపయోగంగా ఉన్న భవనాన్ని పూలే భవనంగా మార్చాలి

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 16 : నర్సంపేట పట్టణంలోని 13వ వార్డులో నిరుపయోగంగా ఉన్న నీటి పారుదల శాఖ భవనాన్ని మహాత్మ జ్యోతీరావుపూలే భవనంగా మార్చాలని కోరుతూ యువజన సంఘాల సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.